'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. కార్యక్రమంలో 'వైస్ టు వర్సు: ట్రాన్స్‌ఫార్మింగ్ ఇన్నర్ వయిలెన్స్' అనే అంశంపై న్యూజిలాండ్‌కు చెందిన ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ట్రైనర్, కోచ్ జిల్లియన్ సావెర్స్ ఉపన్యసిస్తారు.

రోడ్డును పరిశీలించిన ఆర్ అండ్ బీ అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం- పటాన్‌చెరు వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్ అండ్ బీ ఏఈ, కమిషనర్ వెంకటరామయ్య, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్‌తో కలిసి పాడైన రోడ్డును పరిశీలించారు. త్వరలో మరమ్మతులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, గణేష్, వీరేష్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ



గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: సేవా కార్యక్రమాల్లో ఆర్‌కే టీమ్ సభ్యులు ఎప్పుడూ ముందు వరుసలో ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ సూచించారు. శేరిలింగంపల్లి డివిజన్ మసీదుబండలోని పార్టీ కార్యాలయంలో ఆర్‌కేవై టీమ్ ప్రధాన కార్యదర్శి గుండె గణేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పేదలకు గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్, నిష్కల్, వికాస్, శివరాజ్, పాపయ్య, పవన్, రాహుల్, హరి, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

చందానగర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం .. గోపన్‌పల్లికి చెందిన ఎం.తరుణ్ (25) ఆర్సీపురంలో ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా చేస్తున్నాడు. బుధవారం ఉదయం 5 గంటలకు నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్ద చెత్త ఆటో పార్క్ చేసి ఉంది. స్కూటీ పై వస్తున్న తరుణ్ చెత్త ఆటోను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. తరుణ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

మరో ఘటనలో...

ఒడిశా నుంచి వచ్చి ఈసీఐఎల్‌లో ఉంటున్న రాకేష్ జైన్ (39) ప్లంబర్. ఈ నెల 16వ తేదీ పల్సర్ బైక్‌పై చందానగర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్ నుంచి అపర్ణ కన్‌స్ట్రక్షన్‌కు వెళ్తుండగా రోడ్డు పక్కన ఉన్న మ్యాన్‌హోల్ వద్ద బైక్‌పై నుంచి జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలవడంతో రాకేష్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

'ఎస్కి' లో

వివిధ రాష్ట్రాలు, విదేశీ ప్రతినిధుల సందడి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కి) క్యాంపస్ వివిధ రాష్ట్రాల, విదేశీ ప్రతినిధులతో బుధవారం సందడిగా మారింది. ఈ సందర్భంగా అందరూ ఫొటోలు తీసుకున్నారు. ఎస్కిలో పలు శిక్షణా కార్యక్రమాలు జరుగుతుండడంతో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, విదేశీ డెలిగేట్లు వచ్చారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పైప్‌లైన్ రోడ్డులో అడుగుకో గుంత





చందానగర్ మంజీరా పైప్‌లైన్ రోడ్డు దుస్థితి

అడుగుకో గుంత.. అవస్థలు

రోడ్లపై గుంతల్లో నిలిచిన వర్షపునీరు ● ప్రమాదాల బారిన వాహనదారులు

చందానగర్ : వర్షాలకు చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్‌లలో అంతర్గత, ప్రధానరోడ్లు చిత్తడిగా మారాయి. ముఖ్యంగా మంజీరా పైప్‌లైన్ రోడ్డులో నూతన రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డు మధ్యలో పోసిన కంకర, ఇసుకతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు తవ్వి నెల రోజులవుతుందని పనులు సాగడంలేదని ప్రజలు వాపోతున్నారు. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి మొదలుకొని పైప్‌లైన్ మీదుగా హుడాకాలనీ వరకు అడుగుకో గుంత పడ్డాయి. రాత్రి సమయాలలో వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. మరోచోట అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ మ్యాన్‌హోళ్ళలో చెత్త చెదారం పేరుకుపోవడంతో పొంగుతున్నాయి. ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని స్థానికులు మండిపడుతున్నారు. వివిధ కాలనీలలో రోడ్లు గుంతలమయంగా మారాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

వర్షాలు తగ్గాక పనులు ప్రారంభిస్తాం

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చందానగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో రోడ్లు గుంతలు పడ్డాయని ఫిర్యాదులు వచ్చాయి. మంజీరా రోడ్డు విస్తరణ పనులు వర్షాల వల్ల ఆలస్యం అవుతున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టాక గుంతల రోడ్లకు మరమ్మతులు, మంజీరా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తాం.

–చందానగర్ సర్కిల్ 21 డీఈ దుర్గా ప్రసాద్





పీజేఆర్ స్టేడియం వెనుక రోడ్డులో ఏర్పడ్డ భారీ గుంత వరదనీటితో నిండిన దృశ్యం





అసంపూర్తిగా మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులు

మహాసభలను జయప్రదం చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

పటాన్‌చెరు: పటాన్‌చెరులో ఈనెల 23న జరిగే జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లు ఉన్నాయని, తెల్లాపూర్, ఇస్నాపూర్, ఇంద్రేశం, అమీన్‌పూర్, బొల్లారం, జిన్నారం, గడ్డపోతారం, గుమ్మడిదల మున్సిపల్‌లో దాదాపు 1000 మంది మున్సిపల్ కార్మికులు ఉన్నారని, జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్ మున్సిపల్ లో కార్మికులు వందలాదిమంది ఉన్నారన్నారు. ఈ మహాసభకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. జిల్లాలోని మున్సిపల్ వర్కర్లందరూ ఈనెల 23 న పట్టణంలో జరిగే భారీ ర్యాలీ, మహాసభను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.

గురుకులంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాలలో రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. బుధవారం విజిలెన్స్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అదనపు ఎస్పీ సూర్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వైరామకృష్ణతో కూడిన బృందం తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పించిన సౌకర్యాలను, పరిశీలించారు. అనంతరం బియ్యం, సరుకులు, ఆకుకూరలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వారితో కలిసి భోజనం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కల్పనతో సమావేశమై వివరాలడిగి తెలుసుకున్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

అసంపూర్తి పనులు..

దీప్తిశ్రీనగర్ కాలనీలో సగం సీసీ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మియాపూర్ : అసంపూర్తి పనులతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీప్తిశ్రీనగర్ కాలనీలోని ప్రధాన రహదారిలో, శాంతినగర్ వెళ్లే రోడ్డులో సీసీ రోడ్డు పనులు ఆగిపోయాయి. సగం రోడ్డు వేసి మరో సగభాగం అలాగే వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీప్తిశ్రీనగర్ ప్రధాన రహదారి వెంబడి అధిక సంఖ్యలో వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు. దీప్తిశ్రీనగర్ కాలనీ సమీపంలో చెత్త డంపింగ్ యార్డ్ ఉంది.ఈ యార్డ్‌కు ఈ రోడ్డు వెంబడే పలు కాలనీల నుండి చెత్త తరలింపు వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువతి అదుపుతప్పి కిందపడడంతో కాలుకు గాయాలయ్యాయి. అసలే వర్షకాలం.. రోడ్లను తవ్వి అసంపూర్తిగా వదిలేయడంతో వరదనీటిలో ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 40, పచ్చిమిర్చి 50 , బెండ 50, కాకర 40, దొండ 30, దోస 30, ఆలు 30, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 100, వెల్లుల్లి 150.

ట్రిపుల్‌ఐటీ-హైదరాబాద్ నూతన డైరెక్టర్‌గా ప్రొ.సందీప్‌శుక్లా



ప్రొఫెసర్ పీజే నారాయణన్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొ.సందీప్ శుక్లా

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సందీప్ శుక్లా బుధవారం బాధ్యతలు చేపట్టారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డైరెక్టర్ పీజేనారాయణన్ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్ సందీప్‌శుక్లా మాట్లాడుతూ అన్ని రంగాలలో విద్యా సంస్థ ఖ్యాతిని మరింత పెంచడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.కాగా ప్రొఫెసర్ సందీప్ శుక్లాకు సైబర్ సెక్యూరిటీలో అంతర్జాతీయ గుర్తింపు ఉంది.

దస్త్‌కారి హాథ్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12 లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో దస్త్‌కారి హాథ్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో బుధవారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌ను సామాజిక వేత్త, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నాలి సుధారాణి ప్రారంభించారు. భారతీయ వైవిధ్యభరిత సంస్కృతిని ప్రతిబింబిస్తూ దేశం నలుమూలల నుంచి వచ్చిన నేత కార్మికులు, భారతీయ సంప్రదాయ కళా నైపుణ్యాలతో తయారు చేసిన చేనేత ఉత్పత్తులను ఈ వేదిక మీద ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ..గ్రామీణ కళాకారులను నేరుగా కొనుగోలుదారులతో కలిపే ఈ వేదిక వారి జీవనోపాధిని కాపాడటమే కాకుండా భారతీయ కళలను సంరక్షించడంలోనూ ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. నిర్వాహకులు సమీన్ షా మాట్లాడుతూ..అయిదు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల హస్త కళాకారులు వారి ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తారని అన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సామాజికవేత్త సుధారాణి

కేరింతలు, నృత్యాల నడుమ కాలనీలకు 'గణేశ్'లు



రాయదుర్గంలోని భారతీయ యువజన సంఘం వద్దకు గణనాథుడిని తీసుకొస్తున్న దృశ్యం

వినాయక చవితి పండగ సందడి మొదలు

రాయదుర్గం: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కాలనీలకు గణేశ్‌ల రాక మొదలైంది. కేరింతలు, నృత్యాల నడుమ వినాయక విగ్రహాలను తీసుకువస్తున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా వినాయక విగ్రహాలను తీసుకొస్తున్నారు. సోమవారం రాత్రి రాయదుర్గంలోని బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్‌లో ప్రతిష్ఠించేందుకు 12 ఫీట్ల గణేషుడిని ప్రత్యేక వాహనంలో నగరం నుంచి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్యామ్‌లెట్ వీధివాసులు సందడి చేశారు. అదేతరహాలో భారతీయ యువజన సంఘం భవనంలో ప్రతిష్ఠించే గణనాథుడిని కూడా ఆ ప్రాంత యువత తీసుకొచ్చారు.

నవరాత్రి ఉత్సవాలకు గణేష్‌గడ్డ ముస్తాబు

- ఈనెల 27 నుండి సెప్టెంబర్ 6 వరకు ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు: ఈఓ
- ఆలయం వద్ద బందోబస్తు : డీఎస్పీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ సిద్ధి గణపతి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు అవుతుంది. గణేష్‌గడ్డ ఆలయంలో కోరికలు తీరతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో 108 ప్రదక్షిణలు 11 వారాలు వ్రతం చేయాల్సి ఉంటుంది. మంగళ, ఆదివారాలు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేస్తారు. కాగా ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు రోజూ ఒక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారు. మొదటి రోజు 27వ తేదీ ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, హోమం, ప్రదోష పూజ, గణపతి వ్రతకల్పం, పల్లకిసేవతో ప్రారంభమవుతుందని, సెప్టెంబర్ 6వ తేదీ ముగింపు రోజున జాతర నిర్వహిస్తారు. పంచామృతాభిషేకం, మహా నైవేద్యం ,మంగళహారతి ,సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం లడ్డు వేలం, రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈఓ లావణ్య తెలిపారు.



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు (ఫైల్)



గణేష్‌గడ్డ దేవస్థానం

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం . ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో రోజు ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన కార్యక్రమం, ప్రత్యేక పూజలు జరుగుతాయి.

– ఈఓ లావణ్య

బందోబస్తు ఏర్పాటు చేస్తాం...



నవరాత్రి ఉత్సవంలో భాగంగా ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులు క్యూ లైన్‌లో వెళ్లే విధంగా చూడడంతో పాటు వాహనాలు కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేసేలా చూస్తాం. దేవస్థానానికి వచ్చే భక్తులు పోలీసులకు సహకరించాలి.

–డీఎస్పీ ప్రభాకర్, పటాన్‌చెరు

ఒక ఫొటో పలు అంశాలను వివరిస్తుంది

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: నేడు ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాముఖ్యత ఉందని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఎస్‌ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక ఫొటో ఎన్నో అంశాలను వివరిస్తుందన్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కెకె సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ సినిమాటోగ్రఫీ అనేది సృజనాత్మకత, సాంకేతిక అంశాలు, కెమెరా, కథ మధ్య సంబంధం గురించి తెలుసుకొనేలా చేస్తుందన్నారు. ప్రముఖ పోర్ట్రెయిట్ ఫొటోగ్రాఫర్ ఫోట్రియా వెంకీ మాట్లాడుతూ లైటింగ్, ఫ్రేమింగ్ మానవ ఉనికి సారాంశాన్ని ఎలా బయటకు తీసుకురాగలదో ఆయన వివరించారు. వన్యప్రాణి ఫొటోగ్రాఫర్ కన్హా నేషనల్ పార్కు వంటి అభయారణ్యాలలో పులుల వంశాల గురించి దశాబ్ద కాలంపాటు చేసిన డాక్యుమెంటేషన్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ డీన్ ప్రొఫెసర్ ఎంఎస్‌శివరాజు, డాక్టర్ జనార్దన్‌రావు, ప్రొఫెసర్ సత్యప్రకాశ్, ఫొటో జర్నలిస్ట్ హర్ష వడ్లమాని ప్రసంగించారు.



హెచ్‌సీయూలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

హెచ్‌సీయూలోని ఎస్‌ఎన్‌స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ భవనంలో ఫొటో ఎగ్జిబిషన్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. హెచ్‌సీయూ క్యాంపస్ అందాలు, పచ్చదనం, ఆహ్లాద వాతావరణం, రాతి సంపద చిత్రాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ ఈనెల 23వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుంది.